


# శవరావు దినచర్య

ఎం. ఎస్. సూర్యనారాయణ

నేను వాడి దినచర్యని కనిపెట్టడంకోసం రహస్య స్థలాల్లోకి సైతం ఎంత ఘరానాగా చొరబడ్డానో తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. అయినా, ఇలాంటి వ్యవహారాలు నాకుమాత్రం కొత్తకాదు. ఒక చిన్ని కెమేరాతో ... చెప్పులు వేసుకోకుండా ... పిల్లిలా ... అడుగులో అడుగు వేస్తూ వెళ్ళి ఎన్ని రహస్యాలు బట్టబయలు చేశానో నా సర్వీసులో!

ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్టుగా పత్రికలలో నేను బయటపెట్టిన కుంభకోణాలూ ... తీసిన ఫోటోలు అన్నీ ఒక ఎత్తూ – ఇప్పుడు చివరి సారిగా ... నా చిట్టచివరి పరిశోధనగా నేను రచ్చకీడుస్తున్న 'వాడి' దినచర్య ఒక్కటీ ఒక ఎత్తూను!

ఇదివరకు నేను బయటపెట్టిన అవినీతి రహస్యాలన్నీ నా ప్రాణాలకి తెగించి బయటపెట్టినవి. ఇది మాత్రం నా ప్రాణాలు అర్పించి బయట పెడుతున్న భయంకర సత్యం!

వాడు నన్ను హత్య చేయించాడు.

నాలాంటి వ్యక్తి వాడికి శత్రువు కావడంలో పెద్ద ఆశ్చర్యం ఏదీ లేదు. అందుకే నన్ను చంపించేశాడు. చాలా తేలిగ్గా ...
రాజధానిలో వాడు టెలిఫోన్
బటన్లు నొక్కగానే ...
నలుగురుగూండాలు కదిలారు.



నలుగూరు నాలుగు నిమిషాల్లో నా పంచప్రాణాల్నీ ఈ ప్రపంచం నుంచి వేరుచేసి – నా శవాన్ని ఎక్కడో ఓ మురికితూములో కుక్కి చక్కాపోయారు.

కానీ–నా లోపలి జర్నలిస్టునీ ... సత్యాన్వేషినీ హత్య చెయ్యడం మాత్రం వాళ్ళవల్ల కాలేదు!

నేను ప్రాణాలు విడిచిపెట్టగానే ... గాలి కంటే తేలికగా మారిపోయాను! అంతేకాదు ఈ ప్రపంచంలో ఎక్కడికైనాసరే రెప్పపాటులో చేరుకోగల అద్భుతశక్తి ఏర్పడింది! నేనెవ్వరికీ కనపడను! అంతా నాకు కనిపిస్తారు.

ఇకనేం? నా లోపలి జర్నలిస్టు సంచారం మొదలెట్టాడు!

ఇంతకీ నన్ను హత్య చేయించినవాడు శివరావ్‌కాశ్యప్. "శివరావ్ కాశ్యప్ ఎవరూ" అని మాత్రం ప్రశ్నించకండి. వాణ్ణి మీరంతా అందలం ఎక్కించారు.

మీరంతా ఓట్లేసి గెలిపించిన శివ్‌రావ్ ... వాడొట్టి శవరావు!




నేను తిన్నగా వాడి బంగ్లాలోకి ప్రవేశించాను. నే వెళ్ళేసరికి ఖరీదైన సుగంధి సబ్బుతో స్నానించి అద్దం ముందు నిలబడి వున్నాడు శివరావ్.

కాదు ...

నిలబడి వుంది–శివ్‌రావ్ శవం!

ద్రవాల్లో ఊరబెట్టిన ప్రాచీన ఈజిప్ట్ 'మమ్మీ' కన్నా శివ్‌రావ్ ఎంతో గొప్ప శవం! 'మమ్మీ' గాజుపెట్టెలో పడుకుని వుంటుంది. జనం దాన్ని విచిత్రంగా చూసి వెడుతుంటారు. పాపం 'మమ్మీ' కదల్లేదు. దాని ఆత్మ నిస్సహాయంగా గాజుపెట్టెచుట్టూ తిరుగుతూంటుంది.

కానీ శివ్‌రావ్ ... తనే స్వయంగా ప్రజల దగ్గరికి నడిచి వెళ్ళగలడు! అనర్గళంగా ఉపన్యసించగలడు! తనచుట్టూ 'షో'గా జనాన్ని తిప్పించుకోగలడు!

అలాంటి శివ్‌రావ్ తన ముఖాన్ని అద్దంలో ఉత్సాహంగా తడుముకుని మేకప్ చేసుకోడానికి తయారయ్యాడు.

నీట్‌గా తల దువ్వాడు. 'డై' పీల్చుకున్న క్రాఫింగ్ నల్లగా నిగనిగలాడుతోంది. ఖరీదైన సూట్ ధరించి– విదేశీ సెంట్ స్ప్రే చేసుకున్నాడు.

విశాలమైన ఆ గదిలో ఓ అల్మైరా దగ్గరికి నడిచాడు. అందులోంచి ఓ నగిషీ దంతపు పెట్టెను తీశాడు. దాని లోపల ... బోలెడన్ని ముఖాలున్నాయి! రకరకాల తొడుగులున్నాయి!

నవ్వు తొడుగులు ... దుఃఖపు తొడుగులు ... ఆశ్చర్యపు తొడుగులు ... దిగ్భ్రాంతి ... సంతాపం ... దొంతర్లుగా పేర్చి వున్నాయి.

కాన్వెంట్ కుర్రాడు స్కూల్ బ్యాగ్‌లో టైమ్‌టేబుల్ ప్రకారం పుస్తకాలు సర్దుకున్నట్టు –

శివ్‌రావ్ – తనకి అవేళ్టికి కావలసిన వాటిని ఎంచి తీశాడు! అట్లా ఎంచి తీసిన తొడుగుల్ని ... తన ముఖండిక్కీలో పడేశాడు!

అచ్చం స్కూటర్ డిక్కీలా ... లోతైన ఆ ముఖంలో ఎన్ని తొడుగులైనా సునాయాసంగా పట్టేస్తాయి.

నేను చూస్తూండగా చిరునవ్వుని తొడుక్కుని షెడ్యూలు ప్రకారం ఆఫీసుకి చేరాడు.

"సర్! మీకోసం కాన్ఫరెన్స్ హాల్లో ప్రెస్ వెయిట్ చేస్తున్నారు" అని పి.ఏ. చెప్పగానే –చిరునవ్వు స్థానంలో సీరియస్ ఫీలింగ్ తగిలించి, అంతలోనే ఏదో గుర్తొచ్చి –ఈసారి డిక్కీలోంచి దేశభక్తిని తీశాడు! తెల్లారింది మొదలు దేశభక్తితోటే ఎక్కువ పనుంటుంది. శివ్‌రావ్ దేశభక్తి ముఖంతో ప్రెస్‌కి చాలా విషయాలు చెప్పి, హడావుడిగా తన ఛాంబర్‌కి చేరుకున్నాడు.

అక్కడ – సంతకాలకోసం 'ఖరీదైన ఫైళ్ళు' సిద్ధంగా వున్నాయి.

శివ్‌రావ్ ఎలియాస్ శవ్‌రావ్ నిజమైన దినచర్య ప్రారంభమయ్యింది. 'ఖరీదైన' సంతకాల తతంగం సాగుతోంది. వాడి చూపుడువేలుకీ బొటనవేలుకీ మధ్య ఇమిడిన కలం కదుల్తోంది!

ఆ తర్వాత – వాడి టేబుల్‌పైకి మరో ఫైల్ వచ్చింది. ఆత్రంగా ఫైలంతా స్టడీ చేశాను.

నా అదృశ్యరూపానికి ముచ్చెమట్లు పట్టాయి. కళ్ళు ధారాపాతంగా వర్షించాయి. మెల్లగా కళ్ళు తుడుచుకున్నాను. అవి కన్నీళ్ళు కాదు ... రక్తం!

ఈ దేశపు రక్తం!

ఇప్పుడు వాడు ఒక శవ సామ్రాజ్యాన్ని స్థాపించబోతున్నాడు! అందుకోసం వాడికి శవాలు కావాలి!

పచ్చటి జీవక్షేత్రాన్ని శ్మశానంగా మార్చెయ్యడానికి ఎవడికో హక్కులు రాసేస్తున్నాడు!

ఇక్కడి నీటిమీదా ... మట్టిమీదా ... పీల్చేగాలిమీదా హక్కులు అందిపుచ్చుకోడానికి ఎవరో తయారుగా వున్నారు.

సంతకాలకి కలం సిద్ధంగా వుంది.

గుండెలు బద్దలయ్యేలా ఒక్క అరుపు అరిచాను.

ఎవళ్ళకీ ఏదీ వినబళ్ళేదు.

కంఠనాళాల్ని తెంపేసుకుని పిచ్చెత్తినట్టు పరుగుపెట్టాను.

బాబూ! వొక్కసారి చరిత్ర పాఠాలు నెమరేసుకోండి! బాగా గుర్తు తెచ్చుకోండి! తెల్లగా ... తెస్పోడుతూండే వొకడు – నంగిరి నంగిరిగా సలాములు కొడుతూ వర్తకంకోసం "మే ఐ కమిన్" అన్నాడు ఇదివరకు!

తీరా వాణ్ణి లోపలికి రానిచ్చాకకానీ మనకి తెలీలేదు – వాడొక ప్రమాదకరమైన వైట్ స్నేక్ అని! తెలిసేలోగా అంతా అయిపోయింది. ఆ తెల్లటి పాము మన మట్టిపైన విషం కక్కుతూ ... మన అణువణువునీ విడదీసి ... జరజరా పాకుతూ బుసకొట్టి కాటేసింది!

ఆ విషం రెండువందల ఏళ్ళదాకా దిగలేదు! సరే! ఎలాగో దాన్ని పట్టి ... కోరలు పీకి ... ఓ అర్థరాత్రివేళ అవతలకి గిరాటుపెట్టాం.

కానీ–అదిప్పుడు మళ్ళా వచ్చింది!

ఒక తెల్లటి ఒంటెలా వచ్చింది.

మనం ఎడారిలో గుడారం వేసుకుని వున్నాం. అది మన గుడారం దగ్గరకొచ్చి, 'నాక్కొంచెం చోటివ్వ'మంటోంది!

నన్ను కొంచెం రానిస్తే మిమ్మల్ని ఎడారి దాటిస్తానంటోంది!

మల్టీస్టోరేజ్ బిల్డింగులో వుండే ఒంటె అది. దానికి గుడారం ఎందుకంటారా?

ఇలాంటి గుడారాలు దానికి చాలా కావాలి. మొత్తం గుడారాలన్నీ దాని అధీనంలో వుండాలి.

అందుకే ముందు మర్యాదగా

"మే ఐ కమిన్" అంటోంది!

శవరావ్ ఒంటెను "ప్లీజ్ ... కమిన్" అంటున్నాడు.

ఒంటె ముందు మూతి పెడుతుంది. ఆ తరవాత ముఖం. మీకు తెలియని కథేమీకాదు! పర్వతం లాంటి దాని మోపురంతో సహా గుడారంలోకి చొరబడి నిలబడిపోతుంది! మొత్తం గుడారం దాని రాకాసి ఆకారం కింద పడి ... నలిగి నజ్జయిపోతుంది.

అది దాని వ్యాపారం.

ఇప్పుడు చెప్పండి. ఒంటెనేం చెయ్యగలం?

శవ్‌రావ్ చావుతెలివినేం చెయ్యగలం?

బతికున్న మనిషికి ఏమైనా చెప్పొచ్చు. చనిపోతే దహన సంస్కారం చెయ్యొచ్చు. కానీ బతికినట్టుండే రక్త పిశాచినేం చెయ్యాలి?


నా ఈ ఆత్మఘోష మిమ్మల్ని తాకుతోందా?

సత్యాన్వేషకుడిగా నే కనుగొన్న సత్యాన్ని ఆవిష్కరించాను.

నిజం ఎన్నటికీ దాగదు. సత్యాగ్ని దహిస్తుంది.

అదిగో! అటు చూడండి! మా వాళ్ళందరికీ నా హత్య గురించి తెలిసిపోయింది.

మురికికాలవ తూములో పడున్న నా శవాన్ని కనుక్కున్నారు.




కాలువలో నా శవం ఉబ్బిపోయి ... మురికి నీట్లో నానిపోయి భయంకరంగా వుంది.

అదిగో! నా భార్యా ... పిల్లలు ... స్నేహితులు ... బంధువులు ... అంతా నా శవం చుట్టూ మూగారు. అందరికీ దుఃఖం కట్టలు తెంచుకుంటోంది.

పోస్ట్‌మార్టమ్ చెయ్యడానికి వీల్లేకుండా చివికిపోయింది నా శవం.

నా శవం ముద్దని మంటల్లో పడేశారు. కానీ – శివ్‌రావ్ అనబడే శవ్‌రావ్ దినచర్య కొనసాగుతూనే వుంది.

దెయ్యపు సంతకం నవ్వుతోంది!

చాలా మంది పైచదువులకు కష్టపడతారు కాని .... ?

చాలా ప్రైవేట్ ఇన్‌స్టిట్యూట్లు కంప్యూటర్ కోర్సులు బోధన చేస్తాయి కాని ... ?

ఉద్యోగపరంగా ఉపాధి నివ్వగలగాలి !!!

అమెరికాలోని ప్రవాసాంధ్రుల రూపకల్పన

## ప్రభల హైటెక్ ఎంటర్‌ప్రైజస్ ప్రై. లి.

4th Line Brodiepet, Guntur - 2, Ph: 232095, 5th Line Nehru Nagar, Guntur-1, Ph:356705

కంప్యూటర్ రంగంలో వివిధ కోర్స్‌లకు శిక్షణయే కాక

Software Development and DTP Centre ద్వారా ఉపాధిని చూపించగలము.

TARA

అంతేకాక భారత ప్రభుత్వము, 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్' (DOE) మరియు అఖిల భారత సాంకేతిక విద్యామండలి (AICTE) కలిసి కంప్యూటర్ రంగంలో రూపొందించిన ఓ,ఎ,బి,సి, అనే పాఠ్యప్రణాళికను గుంటూరులో విస్తృతంగా ప్రచారం చేస్తున్నాము. డిఒఇఎసిసి పరీక్షలు నాలుగు స్థాయిలు / లెవల్స్‌లో జరుగుతాయి. అన్ని యూనివర్సిటీలు వీటిని గుర్తిస్తాయి. అఖిల భారత సాంకేతిక విద్యామండలి రూపొందించిన విద్యావిధానం, ప్రోగ్రామర్, బిటెక్, యంసిఎ, యంటెక్‌కు సమముగా ప్రమాణాలు. 600 పైగా సంస్థలు భారతదేశమంతా ఈ స్థాయిలకు శిక్షణ ఇస్తాయి. భారత ప్రభుత్వంలోని ఉద్యోగాలకు ఇవి ముఖ్యఅర్హత. పరీక్షలు భారతదేశమంతా, సంవత్సరమునకు రెండుసార్లు, జనవరి, జులై నెలలలో నిర్వహించుదురు. (Vijayawada, Vizag, & Hyderabad)

ప్రభల హైటెక్ ఎంటర్‌ప్రైజస్ ప్రై. లి. **'O' Level** కు Provisional Certificate (557), 1995 April 5న పొందియున్నది.